నారాచంద్రబాబు నాయుడు, మురళీమోహన్, వెంకయ్య నాయుడు

మురళీమోహన్ యాభై ఏండ్ల పండగ..

సీనియర్ నటుడు డా.మురళీమోహన్ నటుడిగా 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. 'డా.మురళీమోహన్ 50 ఇయర్స్ ఆఫ్ ఫిల్మ్ ఎక్సలెన్స్' కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మురళీమోహన్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు గురవారెడ్డి, నర్సాపురం పార్లమెంట్ సభ్యులు రఘురామకృష్ణంరాజు, సుజనాచౌదరి, సినీప్రముఖులు ఎస్.ఎస్.రాజమౌళి, కీరవాణి, సి.అశ్వనీదత్, కోట శ్రీనివాసరావు అతిథులుగా హాజరయ్యారు. మురళీమోహన్ సుదీర్ఘ నటప్రస్థానాన్ని అతిథులందరూ గుర్తుచేసుకున్నారు. ఆయన మంచితనాన్ని, సేవాగుణాన్నీ, ఆర్థిక క్రమశిక్షణను వారందరూ కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖుల పాల్గొన్నారు.

రాజమౌళి సినిమాలో నాగార్జున?

'నా సామిరంగ'తో డీసెంట్ హిట్ అందుకున్నారు నాగార్జున. ఈ వేడిలోనే శేఖర్‌కమ్ముల సినిమాను కూడా చకచకా పూర్తి చేసే పనిలో ఉన్నారాయన. ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న ఈ చిత్రంలో నాగార్జున అండర్‌వరల్డ్ డాన్‌గా కనిపించనున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి 'ధారావి' అనే టైటిల్ ప్రస్తుతం ప్రచారంలో ఉంది. 'ధారావి' అనేది ముంబాయ్‌లోని ఓ ప్రాంతం. ఆ ప్రాంత నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని వినికిడి. ఇదిలావుంటే.. తమిళ దర్శకుడు నవీన్ దర్శకత్వంలో కూడా నాగ్ ఓ చిత్రం చేయనున్నారు. ఇది పూర్తిస్థాయి యాక్షన్ సినిమా రూపొందనుందని సమాచారం. అయితే, ఇది ఓటీటీ సినిమాగా రానుందని తెలిసింది. ఇక అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. మహేశ్‌బాబుతో ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కించనున్న చిత్రంలో నాగార్జున ఓ ప్రత్యేక పాత్ర పోషించనున్నట్టు తాజా సమాచారం. ఈ అంశంపై నాగార్జున, రాజమౌళీల మధ్య చర్చలు కూడా జరిగాయని ఫిల్మ్‌నగర్ టాక్. రాజమౌళి సినిమాలో నాగార్జున అనే వార్త నిజంగా అక్కినేని అభిమానులకు శుభవార్తే. ఏదేమైనా సిక్స్‌టీప్లస్‌లో కూడా యువహీరోలకు పోటీగా సినిమాలు చేసుకుంటూ దూసుకుపోతున్న నాగార్జునను అభినందించాల్సిందే.

హరీశ్ శంకర్, రవితేజ, భాగ్యశ్రీ బోర్సే తదితరులు

మిస్టర్ బచ్చన్ హంగామా..

సినిమామీద సినిమా చేసుకుంటూ జెట్ వేగంతో దూసుకుపోతున్నారు రవితేజ. ప్రస్తుతం ఆయన నటించిన 'ఈగల్' చిత్రం ఇటీవలే విడుదలై థియేటర్లలో ప్రదర్శించబడుతోంది. కానీ రవితేజ మాత్రం విరామం తీసుకోకుండా తన తదుపరి సినిమా 'మిస్టర్ బచ్చన్' షూటింగ్‌లో బిజీ అయిపోయారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆదివారంతో కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్రబృందం అదే లొకేషన్లో 'ఈగల్' సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకున్నారు. 'మిస్టర్ బచ్చన్'లో రవితేజ పూర్తి భిన్నమైన లుక్‌తో కనిపించనున్నారని, ఆయన కెరీర్‌లో ప్రత్యేకంగా చెప్పుకునే సినిమా 'మిస్టర్ బచ్చన్' అవుతుందని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మిక్కీజె.మేయర్ సంగీతం సమకూరుస్తుండగా, అయనంక బోస్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభోట్ల.

నటించేందుకు సిద్ధంగా ఉన్నా..

మయోసైటిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయిన తర్వాత యాక్టింగ్ నుంచి కొంతకాలం విరామం తీసుకుంటున్నట్లు సమంత ప్రకటించిన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తిరిగి నటించేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది సమంత. ఇందులోనే తన ఆరోగ్య పరిస్థితిని కూడా వెల్లడించింది. త్వరలో మళ్లీ నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. యాక్షన్ థ్రిల్లర్ 'సిటాడెల్' తర్వాత సమంత ఒక్క సినిమాకు కూడా సైన్ చేయలేదు. యూఎస్‌లో మయోసైటిస్ వ్యాధికి చికిత్స తీసుకుంటూ ఇన్‌స్టా స్టోరీలతో టైంపాస్ చేసింది. ఆమె 'సిటాడెల్' అనే వెబ్ సిరీస్‌లో నటించిన విషయం తెలిసిందే. దీంట్లో వరుణ్ ధావన్‌తో స్క్రీన్ షేర్ చేసుకుంది సమంత. విదేశీచిత్రం 'చెన్నై స్టోరీస్' కూడా ఆమె సంతకం చేసింది. అయితే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



మహాన్2లో నిజమెంత?

ప్రయోగాత్మక పాత్రల్లో నటించేందుకు ఆసక్తిని కనబరిచే అతి కొద్దిమంది దక్షిణాది నటుల్లో చియాన్ విక్రమ్ ఒకరు. సేతు, శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ.. ఇలా ఎన్నో అద్భుతమైన పాత్రల్లో అలరించాయన. విక్రమ్ నటించిన 'తంగలాన్' చిత్రం ఏప్రిల్‌లో విడుదల కానుంది. పా రంజిత్ దర్శకుడు. ఇదిలావుంటే.. రీసెంట్‌గా సోషల్‌మీడియాలో విక్రమ్ పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆయన నటించిన 'మహాన్' సినిమా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండు స్టిల్స్ షేర్ చేస్తూ 'మహాన్2' అని క్యాప్షన్ పెట్టారాయన. దాంతో.. విక్రమ్ సరదాగా పెట్టారా? లేక సీరియస్‌గానే 'మహాన్' సీక్వెల్ రానుందా? అనేది ఇప్పుడు సినీవర్గాల్లో పెద్ద చర్చగా మారింది. అభిమానుల నుండి కూడా ఊహించని స్పందన రావడం విశేషం. 'ఈ సారైనా థియేటర్లలో విడుదల చేయండి' అంటూ ఓ అభిమాని, 'మేం వెయిటింగ్' అంటూ మరో అభిమాని ఇలా లెక్కకు మించిన కామెంట్లు. నిజానికి రెండేళ్ల క్రితం విడుదలైన 'మహాన్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై అఖండ విజయాన్ని అందుకుంది. చాలాకాలం తర్వాత విక్రమ్‌కి పెద్ద హిట్‌గా నిలిచిందా సినిమా. పైగా అందులో విక్రమ్ తనయుడు ధృవ్ కూడా కీలక పాత్ర పోషించడం విశేషం. ఇంతకీ 'మహాన్2'లో నిజమెంత? అనేది త్వరలో తెలుస్తుంది.

మస్తు షేడ్స్ ఉన్నయ్‌రా నాకు తగ్గ కథ

భవానీ కాసుల, నిఖిల్, అభినవ్ గోమఠం, తిరుపతిరావు

కమెడియన్ అభినవ్ గోమఠం కథానాయకునిగా రూపొందుతోన్న చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నయ్‌రా..'. తిరుపతిరావు ఇండ్ల దర్శకుడు. భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి నిర్మాతలు. ఫిబ్రవరి 23న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని హీరో నిఖిల్ చేతులమీదుగా విడుదల చేశారు. సినిమా ఘనవిజయం సాధించి, అందరికీ మంచి పేరు తీసుకురావాలని నిఖిల్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఇది నా జీవితంలో స్పెషల్ మూమెంట్. నాకీ అవకాశం ఇచ్చిన దర్శకుడు తిరుపతిరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. హీరోగా నాకు చాలా ఆఫర్లు వచ్చాయి. తగిన కథ కోసం ఇన్నాళ్లూ చూశాను. ఇది నాకు తగిన కథ. అందుకే ఓకే చేశాను' అని అభినవ్ గోమఠం అన్నారు. కంటెంట్ బావుంటే చిన్న సినిమానైనా ప్రేక్షకులు ఆదరిస్తారని తన నమ్మకమని, ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందని తిరుపతిరావు నమ్మకం వ్యక్తం చేశారు. ఈ నెల 23న సినిమా విడుదల కానుందని, ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకంతో ఉన్నామని నిర్మాతలు తెలిపారు.

సూపర్ నేచురల్ ఫాంటసీ

సందీప్ కిషన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఊరు పేరు భైరవ కోన'. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలు. హాస్య మూవీస్ పతాకంపై రాజేశ్ దండా నిర్మించారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో వచ్చిన ఈ మ్యాజికల్ ఫాంటసీ ఈ నెల 16న విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ 'దాదాపు రెండున్నరేళ్ల పాటు 'ఊరు పేరు భైరవ కోన' కోసం కష్టపడ్డాను. సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి కమర్షియల్ సినిమా ఇది' అన్నారు. సందీప్ కిషన్ ఈ సినిమాతో నెక్ట్స్ రేంజ్‌కు వెళ్తాడని నిర్మాత అనిల్ సుంకర తెలిపారు. ''ఊరు పేరు భైరవ కోన' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సూపర్ నేచురల్ ఫాంటసీ, మంచి లవ్ స్టోరీ ఉంది' అని దర్శకుడు చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర, చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు.

అనిల్ సుంకర, వర్ష బొల్లమ్మ, సందీప్ కిషన్, వీఐ ఆనంద్ తదితరులు

నన్ను అలా ఎవరూ ఊహించుకోరు

'దేశప్రధాని కావాలనే కోరిక మీకెప్పుడైనా కలిగిందా?'.. ఈ ప్రశ్న ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో కంగనాకు ఎదురైంది. ఇటీవల జరిగిన 'రజాకార్: ది సైలెంట్ జెనోసైడ్ ఆఫ్ హైదరాబాద్' అనే తెలుగు సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కంగనా రనౌత్ పాల్గొన్నారు. ఈ సందర్భంలోనే కంగనాపై ఓ విలేకరి ఈ ప్రశ్నను సంధించారు. దానికి ఆమె మాట్లాడుతూ– 'నేను 'ఎమర్జెన్సీ' అనే సినిమా చేశాను. ఆ సినిమా చూసిన ఏ ప్రేక్షకుడూ నేను ప్రధాని కావాలని కోరుకోడు' అని సూటిగా సమాధానమిచ్చింది. గత ఏడాది ప్రారంభంలో కూడా రాజకీయాలపై తన ఎక్స్ ఖాతా ద్వారా స్పందించింది కంగనా. 'నేను సున్నితమైన వ్యక్తిని. రాజకీయ రంగానికి చెందిన వ్యక్తిని కాదు. రాజకీయాల్లోకి రావాలని నన్ను చాలామంది అడిగారు. అయినా నేను అటువైపు వెళ్లలేదు' అని కంగనా తెలిపింది. కంగనా స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించిన 'ఎమర్జెన్సీ' చిత్రం జూన్ 14న విడుదల కానుంది. దివంగత భారతప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటించిన విషయం తెలిసిందే. జీ స్టూడియోస్, మణికర్ణిక ఫిల్మ్స్ బ్యానర్లు నిర్మిస్తున్న ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, శ్రేయాస్ తల్పాడే తదితరులు కీలక పాత్రల్లో నటించనున్నారు.

గుర్రంపై సంయుక్త సవారీ..

'నా తదుపరి చిత్రం 'స్వయంభు' కోసం, నేను గుర్రపుస్వారీ నేర్చుకుంటున్నా. నిజంగా ఇది అద్భుతమైన ప్రయాణం. మేమందరం ఒక టీమ్‌గా కలిసి పనిచేస్తున్నాం.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది సంయుక్త మీనన్. ఆమె నిఖిల్ కథానాయకుడిగా రూపొందుతోన్న చారిత్రాత్మక చిత్రం 'స్వయంభు'లో కథానాయికగా నటిస్తున్నది. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. హీరో నిఖిల్ 20వ చిత్రంగా ఈ సినిమా రూపొందుతున్నది. ఇందులో హీరో నిఖిల్ యోధుడిగా కనిపించనున్నాడని, అందుకే పలు యుద్ధవిద్యల్లో ప్రావీణ్యం పొందే పనిలో నిఖిల్ బిజీగా ఉన్నాడని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాలో అద్భుతమైన యుద్ధ సన్నివేశాలు ఉంటాయని, గతంలో ఎన్నడూ చూడని భయంకరమైన పోరాటాలను ఇందులో చూస్తారని వారు తెలిపారు. ఇంకా చెబుతూ 'ఇందులో సంయుక్త మీనన్ పాత్ర కథలో చాలా కీలకం. కథానుగుణంగా నిఖిల్‌తోపాటు ఆమె కూడా కొన్ని యుద్ధ సన్నివేశాల్లో పాల్గొంటారు. అందుకోసమే గుర్రపుస్వారీతోపాటు యుద్ధ విద్యల్ని కూడా నేర్చుకుంటున్నారు' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: వాసుదేవ్ మునెప్ప, కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: రవి బస్రూర్, నిర్మాణం: పిక్సెల్ స్టూడియోస్, సమర్పణ: ఠాగూర్ మధు.

సల్మాన్-సూరజ్ భర్జాత్యా కాంబోలో..

'మైనే ప్యార్ కియా', 'హమ్ ఆప్ కే హై కౌన్'తోపాటు 'ప్రేమ్ రతన్ ధన్ పాయో' వంటి అత్యంత విజయవంతమైన చిత్రాలు అందించిన దర్శక–నట ద్వయం సూరజ్ భర్జాత్యా, సల్మాన్ ఖాన్. ఈ కాంబోలో మరో సినిమా రానుంది. 2015లో వచ్చిన 'ప్రేమ్ రతన్ ధన్ పాయో' వీరిద్దరి కాంబినేషన్‌లో చివరి సినిమా. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ కాంబినేషన్ రిపీట్ అవుతుండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్న అంశం. భారీస్థాయిలో తెరకెక్కించనున్న ఈ ప్రాజెక్టు కోసం సల్మాన్ 26 నెలలు డేట్స్ ఇచ్చినట్టుగా బాలీవుడ్ టాక్. అయితే ఈ సినిమాకు సంబంధించి టైటిల్ కానీ, మిగతా నటీనటుల గురించి కానీ అధికారికంగా ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా, కరణ్ జోహార్ రూపొందిస్తున్న ఓ చిత్రంతోపాటు మరికొన్ని సినిమాలు సల్మాన్ చేతిలో ఉన్నాయి.

దిగజారుతున్న బంధాల కథ

తోబుట్టువుల పాత్ర అనగానే బాలీవుడ్‌లో చాలా మందికి గుర్తుకువచ్చేది అపర్‌శక్తి ఖురానానే. ఆయనతో కలిసి వాణి కపూర్ నటించనున్న సినిమా త్వరలో పట్టాలెక్కనుంది. నిక్కీ విక్కీ భగ్నాని ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కనుందీ చిత్రం. పరేష్ రావల్ ఈ చిత్రంలో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. నవజ్యోత్ గులాటి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను నిక్కీ భగ్నానీ, విక్కీ భగ్నానీ నిర్మించనున్నారు. ఆధునిక కాలంలో బంధాలు బంధుత్వాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతున్నది. మనుషుల మధ్య సంబంధాలు అంతకంతకూ దిగజారిపోతున్న తీరును ఈ సినిమాలో చూపించనున్నారు. కుటుంబ కథగా రూపొందుతున్న ఈ చిత్రంలో వాణి కపూర్, అపర్‌శక్తి తోబుట్టువులుగా కనిపించనున్నారు. వాణి కపూర్ నటించిన 'రైడ్2' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. నవంబర్ 15న విడుదల కానున్న ఈ సినిమాలో వాణి కపూర్ అజయ్ దేవగన్‌కు జోడీగా కనిపించనున్నారు.